పరీక్షలు రాయనోళ్లే దీక్ష చేస్తుండ్రు

ఆ ముగ్గురూ ఉద్యోగాలకు పోటీలో లేరు

నిరుద్యోగుల తరఫున కొట్లాడుతున్నవారిని అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని ప్రకటన

కూకట్‌పల్లి జేఎన్టీయూలో ముఖాముఖి

హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, డీజీపీ

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : కొన్ని రాజకీయశక్తులు, కొచింగ్ సెంటర్ల యాజమాన్యాలు మాత్రమే పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నాయని, తాము సకాలంలో పరీక్షలు నిర్వహిస్తే రాజకీయ నిరుద్యోగులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులకు నష్టం జరుగుతుందని, అందుకే వాళ్లు పరీక్షల వాయిదా కోరుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 60 లక్షల మంది నిరుద్యోగులున్నారని, నిరుద్యోగ సమస్య పరిష్కరించకుంటే తాము ప్రజాప్రతినిధులుగా విఫలమైనట్టేనని పేర్కొన్నారు. పరీక్షలు సకాలంలో పూర్తయితే ఉద్యోగాలు రానివారు వేరే జాబ్స్ చూసుకుంటారని, అందుకే తాము పరీక్షలు వాయిదా వేయడం లేదని స్పష్టంచేశారు. కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో 'క్వాలిటీ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్' అంశంపై శనివారం నిర్వహించిన ముఖాముఖిలో సీఎం ప్రసంగించారు. పదేండ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేవని, తామిప్పుడు పరీక్షలు నిర్వహిస్తుంటే వాయిదా వేయాలంటున్నారని చెప్పారు. నోటిఫికేషన్‌లో పొందుపరిచిన ప్రకారమే గ్రూప్-1లో 1:50 నిష్పత్తి అమలు చేస్తున్నామని, 1:100 నిష్పత్తిపై తమకేం అభ్యంతరం లేదని, కోర్టుకెళ్తే నోటిఫికేషన్ రద్దయ్యే ప్రమాదముందని తెలిపారు.

డిసెంబర్ 9లోపు ఉద్యోగాల భర్తీ..

ఈ అసెంబ్లీలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం ప్రకటించారు. ఏటా మార్చి 31లోగా అన్నిశాఖల్లో ఖాళీలు సేకరించి, జూన్ 2 లోపు నోటిఫికేషన్లు జారీచేసి, డిసెంబర్ 9లోపు భర్తీ చేస్తామని వివరించారు. గ్రూప్ 1, 2,3, డీఎస్సీ పరీక్షలు పూర్తిచేసి ఈ ఏడాది లోగా ఉద్యోగాలు కల్పిస్తామని, జాబ్ క్యాలెండర్‌కు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక 90 రోజుల్లో 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని పునరుద్ఘాటించారు. రాజకీయాలు, తీవ్ర సమస్యల కారణంగానే ఈ ఆరు నెలల్లో విద్యారంగంపై దృష్టి సారించలేదని చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ

ఇంజినీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తిచేసే కర్మాగారాలుగా మారరాదని, ఇంజినీరింగ్ విద్యలో క్వాలిటీ పెంచాలని సీఎం కోరారు. ఇంజినీరింగ్ అంటే కేవలం కంప్యూటర్ సైన్సేకాదని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కూడా నడపాల్సిందేనని సూచించారు. యువత కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో రూ. 2400 కోట్లు వెచ్చించి ఐటీ ఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మారుస్తున్నామని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వన్ టైం సెటిల్‌మెంట్

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలపై యాజమాన్యాలు వన్‌టైం సెటిల్‌మెంట్ లాంటి ప్రతిపాదనతో వస్తే పరిష్కరిస్తామని రేవంత్ చెప్పారు. ఈ బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాలి

సమాజంలో పెడదోరణులకు టెక్నాలజీ కూడా కారణమని, పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలిసింగ్ నేర్పించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. జేఎన్టీయూలో నిర్వహించిన స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కేరళ తరహాలో మోరల్ పోలీసింగ్ సిస్టంను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

200 ఎకరాల్లో 'ఏఐ'సీటీ : శ్రీధర్‌బాబు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని జీహెచ్ ఎంసీలో 200 ఎకరాలల్లో ఏర్పాటు చేయబోతున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. జేఎన్టీయూ కాలేజీ ద్వారానే ఇంజినీరింగ్ విద్యలో సమూల మార్పులు రావాలని ఆకాంక్షించారు. ఏఐకి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి తాము సెప్టెంబర్‌లో ఏఐ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐటీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి, ఇంటర్ విద్యా కమిషనర్ శృత ఓఝా, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతం, పోలీసు ఉన్నతాధికారులు సుధీర్‌బాబు, అవినాశ్ మహంతి పాల్గొన్నారు. సెప్టెంబర్‌లో నిర్వహించే ఏఐ సమ్మిట్ పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు.

రేవంత్ నోట.. అబద్ధపు మాట

డీఎస్సీ నోటిఫికేషన్ రెండేండ్ల కింద జారీచేశారని సీఎం రేవంత్ అబద్ధమాడారు. అభ్యర్థులు రెండేండ్లుగా డీఎస్సీ కోసం ప్రిపేరతున్నారని, రెండేండ్ల క్రితం నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో వారిలో అశాంతి నెలకొందని చెప్పి తన వాఖ్యలను సమర్థించుకున్నారు. 'పదేండ్ల నుంచి నోటిఫికేషన్లు లేవు. రెండేండ్ల క్రితం డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. వాయిదాల మీద వాయిదా పడుతూనే ఉంది. మేం నిర్వహిస్తుంటే వాయిదా వేయాలని కోరుతున్నారు' అని వ్యాఖ్యానించారు. కాసాగత కేసీఆర్ ప్రభుత్వం 6, 612 పోస్టులతో 2023 ఆగస్టు 24న డీఎస్సీ ప్రకటించింది. 2023 సెప్టెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల చేసి, సెప్టెంబర్ 20 నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆ తర్వాత నోటిఫికేషన్‌ను రేవంత్‌రెడ్డి సర్కారు రద్దు చేసి, ఈ ఏడాది ఫిబ్రవరి 29న 11,062 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ సీఎం రేవంత్ మాత్రం రెండేండ్ల క్రితం నోటిఫికేషన్ జారీచేశారని నోరుజారారు.

- బస్సు కోసం రోడ్డెక్కిన మహిళలు

తమ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన మహిళలు శనివారం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. మండల కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి రోడ్డు మార్గం ఉన్నా.. మధ్యలో 12 గిరిజన గ్రామ పంచాయతీల ప్రజలకు ఉపయోగపడే అవకాశం ఉన్నా బస్సును ఎందుకు నడపడం లేదని వారు ప్రశ్నించారు. - టేకులపల్లి

సమస్యలపై నిరసన గళం

మంథనిలో రైతుల రాస్తారోకో

దశాబ్దాలుగా తమ పొలాల వద్దకు వెళ్లే చెరువుకట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని శిక్షించాలని పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లి రైతులు ఆందోళనకు దిగారు. శనివారం చెరువుకట్ట రోడ్డును పునరుద్ధరించే పనులను ప్రారంభించగా, కబ్జాదారులు వచ్చి అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసింది. పోలీసులు వచ్చి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించగా, రైతులంతా మంథనికి చేరుకొని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు.

- మంథని/మంథని రూరల్

కరెంటు కోతలపై కన్నెర్ర

అల్లాదుర్గం/మంథని, జూలై 13 : మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గొల్లకుంట తండాలో నెల రోజులుగా విద్యుత్తు కోతలు విధిస్తుండటంతో గిరిజనులు మండిపడుతున్నారు. కరెంట్ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో శనివారం అల్లాదుర్గం సబ్‌స్టేషన్ ఎదుట 161వ జాతీయ రహదారిపై బైఠాయించారు. దాదాపు అరగంటపాటు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ.. రెప్పపాటు కరెంట్ కోతలు ఉండకూడదని ప్రభుత్వ ఆదేశాలను విద్యుత్తు అధికారులు బేఖాతరు చేస్తున్నారని మండిపడ్డారు. గొల్లకుంట తండాలో నెల రోజులుగా విద్యుత్తు కోతలు విధిస్తున్నారని, రాత్రిపూట కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో దొంగతనాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఎస్సై దేవిదాస్ వచ్చినా సముదాయించినా భీష్మించుకు కూర్చున్నారు. వెంటనే ఆయన విద్యుత్తు అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా ఆయన హామీ మేరకు ఆందోళన విరమించారు.

మంథనిలో కాకరపల్లి మహిళల ధర్నా

విద్యుత్తు సరఫరా నిలిపి వేశారంటూ పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాకర్లపల్లికి చెందిన దళిత మహిళలు ఆందోళనకు దిగారు. శనివారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత కాలనీకి చెందిన తమకు కరెంట్ మీటర్లు లేవని, తీగల ద్వారా విద్యుత్తును తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు దౌర్జన్యంగా కరెంట్ తీగలను ఇష్టంవచ్చినట్టు కట్ చేశారని మండిపడ్డారు. ఏఈ రాజమల్లయ్యను స్పందిస్తూ.. కాకర్లపల్లిలోని ఎస్సీ కాలనీ వాసులకు విద్యుత్తు మీటర్లు లేవని అన్నారు. అక్రమంగా విద్యుత్తు వాడుకుంటున్నందున తమ సిబ్బంది వెళ్లి తీగలను తొలగించారని, ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని స్పష్టంచేశారు.

- క్వారీలో అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

కలంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులో మోయతుమ్మెద వాగులో ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలో పరిమితికి మించి, సమయం గడిచినా తవ్వకాలు చేపడుతున్నారంటూ రేణికుంట రైతులు, యువకులు ఆందోళనకు దిగారు. శనివారం మధ్యాహ్నం ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ కనుకయ్యకు వినతిపత్రం అందజేశారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.– తిమ్మాపూర్

సింగరేణి క్వార్టర్లకు విద్యుత్తు నిలిపివేత

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సింగరేణి క్వార్టర్లను కూల్చి రోడ్లు వెడల్పు చేయాలని నిర్ణయించారు. కొందరు ఇంకా ఖాళీ చేయకపోవడంతో శనివారం 84 క్వార్టర్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఒకే వైపు 100 నుంచి 200 ఫీట్ల వరకు క్వార్టర్లను తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ నిర్ణయించడం సరైందికాదని కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. - గోదావరిఖని

డీటీ వేధింపులు తాళ లేక..

రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య

రామారెడ్డి, జూలై 13: డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కన్నాపూర్‌లో శనివారం వెలుగుచూసింది. డీఎస్పీ నాగేశ్వర్ రావు తెలిపిన ప్రకారం.. కామారెడ్డి మండలం గూడెంకు చెందిన తెడ్డు ప్రశాంత్ (28) తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేవాడు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ అతడిని తరచూ వేధింపులకు గురి చేయడంతో రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులోని చెట్టుకు శనివారం ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా డీటీ వేధింపుల వల్లే చనిపోతున్నానని ప్రశాంత్ రాసిన సూసైడ్ నోట్ అతడి జేబులో లభించింది. మృతదేహాన్ని కామారెడ్డి దవాఖానకు తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే, సివిల్ పోలీసులు

రైలు పట్టాల పక్కన రెండు మృతదేహాలు

ఇందల్వాయి, జూలై 13: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి రైల్వే స్టేషన్ సమీపంలోని రైలు పట్టాల పక్కన శనివారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే ట్రాక్ వద్ద స్థానికులకు రెండు మృతదేహాలు కనిపించడంతో డిచ్‌పల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పోలీసులకు ఫోన్ చేయగా, వారు వచ్చి పరిశీలించగా మృతుల వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాలను నిజామాబాద్ దవాఖానకు తరలించారు.

మా భూమి మాకే!

మొదటిపేజీ తరువాయి...

మొక్కుతం.. మా బతుకులను ఆగం చెయ్యకండి. ఉన్నది పోతే సాగు చేసుకోడానికి గుంటెడు జాగ ఉండదు.. ఒకవేళ తప్పదనుకుంటే మాకు భూమికి భూమి ఇచ్చి న్యాయం చెయ్యండి' అంటూ బోరున విలపించారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడగా రీజినల్ రింగ్ రోడ్డు కోసం విలువైన పంట భూములను కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఉన్న భూమి గుంజుకుంటే మా బతుకులు ఎట్లెల్లాలె? మేము ఏం సాగు చేసుకొని బతకాలె? ఉన్నదే ఎకరం.. అరెకరం. అదీపోతే మా ఆదెరువు ఎట్ల? మా భూములు మాకే ఉండనియ్యండి.. మమ్మల్ని బత్కనియ్యండి' అంటూ మండిపడుతూనే మరోవైపు అధికారుల కాళ్లావేళ్లాపడ్డారు. పాత అలైన్‌మెంట్ కాకుండా కొత్తగా చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని, రీజినల్ రింగు రోడ్డు వద్దేవద్దని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ లైన్, కాళేశ్వరం కాలువ కోసం భూములు కోల్పోయామని వాపోయారు. కలెక్టర్ మోఖామీదకు వచ్చి తమ మొర వినాలని కోరారు. భూమికి భూమి, నష్టపరిహారంపై స్పష్టమైన హామీ ఇచ్చేదాకా సర్వే చేయనిచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారు చెరువు నుంచి రీజనల్ రింగు రోడ్డు వేస్తున్నారని రైతులు చెప్పగా అలాంటిదేమీ లేదని, చెరువు లోంచి వెళ్లడం లేదని వివరించారు. రైతులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. రైతుల విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆర్డీవో చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. కాగా నర్సాపూర్‌లో రెండు రోజులుగా కాళేశ్వరం కాల్వ భూసేకరణ ఆపాలంని రిలే దీక్షలు కొనసాగుతున్నాయి.

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామ రైతులు శనివారం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న దృశ్యం

నాకున్న ఒకటిన్నర ఎకరం పట్టా భూమి రీజినల్ రింగు రోడ్డులో మొత్తం పోతున్నది. ఉన్నదంతా పోతే మేమెట్ల బతకాలె?. ఇద్దరు పిల్లలను ఎట్ల పోషించాలె. భూమి పోతే మాకు చావే దిక్కు. పురుగుల మందు తాగి సచ్చుడుతప్ప మరోటిలేదు.. మాకు న్యాయం చేయండి. మాకున్న కొద్ది పాటి భూమికి బదులు భూమివ్వండి'

- నీరుడి శంకర్, రత్నాపూర్, శివ్వంపేట మండలం

ఆర్కే-7 గని నార్త్‌లో ఉత్పత్తి నిలిపివేత

డిప్యూటేషన్లపై 300 మంది కార్మికుల బదిలీ

శ్రీరాంపూర్, జూలై 13 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిలో నార్త్ ఉత్పత్తి పనిస్థలాల్లో ఉత్పత్తి నిలిపివేయాలని కేంద్ర పర్యావరణ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. నార్త్ భాగంలో బొగ్గు ఉత్పత్తికి 2020 వరకే అనుమతి ఇచ్చినట్టు పేర్కొంది. 2019 నుంచి గని విస్తరణకు అనుమతి కోసం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్‌కు సింగరేణి యాజమాన్యం నాలుగుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ తిరస్కరించినట్టు తెలిసింది. అనుమతి వచ్చే వరకు ఉత్పత్తి నిలిపివేయాలని అధికారులు శనివారం ఆదేశించినట్టు సమాచారం. నార్త్ పని స్థలాల్లో ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు 300 మంది ఉద్యోగులను ఇతర గనులకు తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేయనున్నారు. నెల రోజుల్లో తిరిగి బొగ్గు ఉత్పత్తికి అనుమతులు వచ్చే అవకాశం ఉన్నదని, అప్పుడు తిరిగి కార్మికులను ఆర్కే-7గనికి తీసుకుంటామని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. అనుమతులివ్వడంలో కేంద్రం జాప్యం సరికాదని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి అన్నారు. డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.